# అంతస్తుల నాగరికత

**వేదుల కామేశ్వరరావు**

బస్సు కదిలింది. ఎండ వేడిమికి తట్టుకోలేక బస్సులోకి వచ్చిపడినవాళ్ళల్లో సగంమందికే సీటు దొరికింది. మిగిలినవాళ్ళు ఇనప కడ్డీలు పుచ్చుకొని వ్రేలాడుతున్నారు. బస్సులోకి ప్రవేశమే దొరకని కొందరు దురదృష్టవంతుల కోపాలను నిరసిస్తోందా అన్నట్టు పెద్ద ధ్వని చేసుకొంటూ బయలుదేరింది బస్సు.

ఇంకా ఐదు నిముషాలైనా కాలేదు. బస్సులో పెద్ద రణగొణ ధ్వని ప్రారంభమైంది. ఆడవాళ్ళు వెనకాల సీట్లలో కూర్చొన్నారు. అక్కడకు దగ్గరలో వున్న సీటులో ఒక ముసలాయన కూర్చొన్నాడు.

“ఇంతమంది ఆడవాళ్ళు ఇలా నిలబడి వుండగా నువ్వు కొంచెం లేచి అలా ముందు కెళ్ళకూడదుటయ్యా పంతులూ!” అంది ఒక ముసిలావిడ.

“నేను నయాపూల్ నుంచి ఇక్కడే కూర్చొన్నాను. నన్ను కూర్చోమనడానికీ లేవమనడానికీ నువ్వెవరు?”

“నే నెవర్ని బాబూ! నేనో ముసిలిముండని. అయినా కాలం ఇట్టా మండిపోతా వుంది. ఇంతమంది ఆడపడుచులు పిల్లలతో నిలబడలేక పడతా, లేస్తావుంటే నీ కా మాత్రం ఆలోచన లేదుటయ్యా?” ముసిలావిడ ముసిలాయనను వెక్కిరించింది.

దాంతోటి బస్సులో కలకలం రేగింది. ముసిలమ్మను ఆడపడుచులందరూ తెగపొగిడి వదిలి పెట్టారు. మగవాళ్ళల్లో కొంతమంది ముసిలాయనను బలపరిచారు. ఈ ఆడవాళ్ళకు ఎక్కడికెళ్ళినా ప్రత్యేకస్థానం ఇవ్వటం బుద్ధి పొరపాటన్నారు. కొందరు మాత్రం, ముసిలాయనను వ్యతిరేకించారు. తమ తీవ్ర నిరసన తెలిపారు. ఆడవాళ్ళు పిల్లలతో నిలబడటం కష్టమన్నారు. మగవాళ్ళం వాళ్ళకి ఉపకారం చెయ్యకపోతే రేపొద్దున్న మన వాళ్ళే ఈ స్థితిలో వుంటే వాళ్ళగతేం కావాలని ప్రశ్నించుకొన్నారు. కొందరు నీళ్ళు నమిలి అదీవుంది...ఇదీ వుందన్నారు. వాద ప్రతివాదనలు తీవ్రరూపం దాల్చకపోయినా ప్రయాణీకులలో సంచలనం కలిగింది. రెండు మూడు స్టేజీలు దాటేవరకూ జనం ఆ విషయానికే చిలవలూ పలవలూ తొడిగి తర్కవితర్కాలతో కాలక్షేపం చేశారు.

ముసిలావిడ కొంతసేపు మౌనం దాల్చి ఇంకో స్టేజి దాటగానే మళ్ళీ ఈ విషయాన్ని కెలకటం మొదలెట్టింది. ముసిలాయన ఆవిడ అన్నదానికి ప్రతిగా ఏదో ఒకటి అంటూనే వున్నాడు. ఉండుండి ఒక్కసారిగా ఆవిడకు కోపం ఉద్రిక్తమైపోయింది.

“గోతికింద నక్కల్లే కూర్చొన్నావులే గాని ఇంకీపాటికి లేవ్వయ్యా! లెగు, లెగు!” అంది ఆమె. కోపావేశంలో గొంతుక జీరపోయినా గట్టిగా అరిచింది.

అంతే! ఆడవాళ్ళందరూ తలోమాటా విసిరారు. మెల్లిగా గాలివాన దుమారం లేచింది. మాటలు సూదుల్లా గ్రుచ్చుకొంటున్నాయి. ఇంకా ఘర్షణ తీవ్రరూపం దాల్చలేదు.

కండక్టరు ఇంతవరకూ ఓపికపట్టినవాడల్లా ఆ చివరనుంచి ఈ చివరకు దూసుకొచ్చాడు. “ఏమిటయ్యా పంతులూ! బస్సును నువ్వుగాని కొనుక్కున్నావా? ఆడవాళ్ళు అంత ఇదిగా చెబుతూంటే నీకామాత్రం తెలియద్దుటయ్యా?” అన్నాడు కండక్టరు.

“నేను నీకు డబ్బు లిచ్చాను. నువ్వు టిక్కట్టిచ్చావ్. నేను దిగవలసిన స్టేజి వచ్చేవరకూ నన్ను బ్రహ్మదేముడైనా కదపలేడు తెలుసా?” అన్నాడు ముసిలాయన తన దృఢనిశ్చయాన్ని పదిమందికీ తెలియ బరుస్తూ.

“ఏమిటయ్యా నువ్వనేది? నీకసలు బుద్ధుందా లేదా? నేను బస్సు కండక్టర్ని! బ్రహ్మదేము డొచ్చినా నిన్ని సీటులో కూర్చోనియ్యను” అంటూ కండక్టరు ఆయన రెండుచేతులూ పుచ్చుకొని బలంగా లాగి ఒక్కగెంటు గెంటాడు. ముసిలాయన వెళ్ళి నిలబడ్డజనంలో పడ్డాడు. ఆయనకు కోపం ముంచుకురాగా తొడి ప్రమాణాన్ని లేచాడు. నలుగురూ పట్టుకొని నిలబెట్టినా పూనకం పూనినట్లు బస్సులో పెద్ద వీరవిహారం చేస్తున్నాడు.

కండక్టరుకూ కోపం తగ్గలేదు. ఆయ నింకా సణిగితే క్రిందకు దింపేస్తానన్నాడు. ప్రయాణీకులు ఇరుపక్షాలవారినీ శాంతింపచెయ్యటానికి సర్వప్రయత్నాలూ చేశారు. ముసిలాయన ఏదో అన్నాడు. కండక్టరు చెయ్యెత్తాడు. నలుగురూ అతడ్ని వెనక్కులాగి ఊరుకోబెట్టారు.

ఇంకో స్టేజి దాటింది. బస్సు కదిలింది. ఒకాయన నిలబడి “అయ్యో నే నిక్కడే దిగాలి” అన్నాడు.

“నిద్రపోతున్నావా? ఊ రొచ్చి. ఒక అణా ఇలాఇచ్చి టిక్కట్టు పుచ్చుకో” నిప్పులు చెరిగినట్లు మాట్లాడాడు కండక్టరు.

“మాటలు తిన్నగా రానియ్యి” అన్నాడు దిగటం మర్చిపోయినవాడు.

“ఏం చేస్తావేంటి?” మళ్ళీ చెయ్యెత్తాడు కండక్టరు.

జనం అతడ్ని వెనక్కులాగి ఊరుకోబెట్టారు.

ఇంకో స్టేజిదగ్గర బస్సు ఆగింది. మర్చిపోయినవాడు సణుక్కుంటూ దిగాడు. కండక్టరు బెల్లు గట్టిగా నొక్కాడు. బస్సు కదిలింది.

“స్టేషనుకు రెండు టిక్కట్టు లియ్యి నాయనా!” అంది ఒకావిడ.

“నువ్వసలు బస్సు ఎవర్నడిగి ఎక్కావమ్మా? ఈ బస్సు స్టేషనుకుపోదు. రాణీగంజ వెడుతుంది. మీకు తెలియదు; ఒకళ్ళ నడగరు! దిగుదిగు!!” అన్నాడు కండక్టరు.

బస్సు ఆగింది; ఆమె దిగింది.

కండక్టరు ఇంకోకాయన దగ్గరకు వెళ్ళి చెయ్యిసారించాడు.

“ఏం కావాలి?” అన్నాడాయన నిర్లక్ష్యంగా.

“నా బొంద! తమరు టిక్కట్టు పుచ్చుకొన్నారా?” అన్నాడు కండక్టరు.

“ఓ అదా!” అంటూ ఆయన పావలా కాసు కండక్టరు చేతిలోపెట్టి బస్సు కిటికీ

(41-వ పేజీ చూడండి)

డిస్మెంసాల్
కుసుమ, బహిష్టు నొప్పులకు
అద్భుతముగా పని చేయును
వివరములకు — AGENTS
R.K.BROTHERS
4/27. RAJAHMUNDRY

# సువర్ణచాలా మిశ్రమం

(26-వ పేజీ తరువాయి)

"సువర్ణ చాలా మిశ్రమం" అని ఓ లేహ్యం ఆయనకి అజీర్తే కదుటమ్మా..." అంటూ ఓడబ్బా తీసుకొచ్చి చూపించిం దావిడ.

బజార్లో ఆ మందులమ్మే అతన్ని కనుక్కోవడం సరోజినికి కష్టం కాలేదు. పట్నంలోకల్లా రద్దీ అయిన స్థలమేమో అతనికి బాగా బేరం తగిలినట్టుంది. చుట్టూ మూగిన ప్రజకి ఉపన్యసిస్తున్నాడు.

'.. అయ్యా దీని ప్రధానగుణం మలబద్ధాన్ని మాయం చెయ్యడమండి. కడుపునొప్పి ఉంటుంది; దీన్ని తింటే మరి కనిపించదండి. రాత్రులందు నిద్రఉండదు; ఇలాటి చెంచా ఒకటి పుచ్చుకుని యీ మాత్రం సేవించండి...'

'దీని పేరండీ?'

'చెప్తున్నానండి...అలా సేవిస్తే కొట్టేసినట్టు కమ్మని నిద్రపడుతుందండి. ఇంకా దీనిగుణాలు వివరంగా ఆ పేపర్లోఉన్నాయి. దీని పేరు సువర్ణ చాలా మిశ్రమమండి, బంగారమేగాక యిందులో ఇంకా చాలా చాలా కలిసివున్నందువల్ల ...'

'అరరె! వైరి సమాసంచేశారే,' అని గుంపులో ఎవరో నవ్వారు.

మందులతను నవ్వుతూ 'అయ్యా మేం అజాతశత్రువులమండి. మాకు సమాసాలతో నయినా వైరం లేదు. అదీ గాక—చతుర కవిరాజ బిరుదాంకిత చరక విరచిత సువర్ణాది మిశ్రమములనే గ్రంథంలో వీని పేరు గూర్చి విశదంగా ఉందండి.. దీన్ని పెద్దవారూ పిల్లలూ కూడా వాడవచ్చును. పథ్యంలేదు. కావలసినవారు త్వరపడండి. కొద్ది డబ్బాలే ఉన్నాయి. దీని ఖరీదు ఒక్క రూపాయి మాత్రం. మీ పిల్లలకి బిస్కెట్ల పొట్లం కొన్న సాటిలేదండి వారం రోజు లుంటాం. గుణం కనబడకపోతే డబ్బు వాపసుఇస్తాం.'

ప్రజలు కొంచెం ముంగుకు వచ్చారు.

అతను ఇంకొకటి తీసి చెప్ప సాగాడు: 'అయ్యా ఇది పరికించండి "భారతీ కచభార వర్ధకాషధ"మని దీనిపేరు. జబ్బుచేసిగాని మరోలాగాని శిరోజాలు తరిగిపోతాయి చూడండి. అలాటివారు అరచేతిలో ఆ మాత్రం నూనె వేసుగుని ప్రతిరోజూ తలకి మర్దణా చేసుగుంటే శరవేగంగా శిరోజాలెదుగుతాయి. జడవేసుగుంటే జెర్రిగొడ్డులా...'

'గోరం గురో! నడిరోడ్డుమీద ఆడదాని హత్య! కవితా కన్యకఖూనీ!' అని గుంపులో నవ్వులు:

'అయ్యా కొత్త ఉపమానాన్ని సృష్టించడం అపచారం అయితే "తాచులా" అనే చెప్పుకుందాం. ఈ తైలం ఖరీదు సీసా ఒక్కంటికి రెండు రూపాయిలు. మూడు బుడ్లు ఒకేసారి తీసుకున్న వారికి మొత్తం మీద ఒకరూపాయి తగ్గిస్తాం.'

పిల్లలకోసం లేహ్యం కొనాలని దూరంగా నిల్చున్నదల్లా అతని తియ్యని కబుర్లువిని తనకి ఓ నూనెసీసాకూడా కొనుక్కుంటే బాగుండు ననిపించింది. అవును మరి, సరోజినికి జుత్తు ఊడిపోయిన దగ్గర నుంచి తల కొట్టేసినట్టుగా ఉంది. పిల్లల ఆరోగ్యం ఎంతో, తన అందమూ అంతే ఆ యిల్లాలికి.

మగాళ్లమధ్యకి వెళ్లడం ఎందుకని ఓ కుర్రాడి చేతికి డబ్బు ఇచ్చిపంపింది.

* * *

ఆ రాత్రి భర్తతిని లేచిన తర్వాత సరోజిని భోంచేస్తూంటే 'ఇవెక్కడివో?' అంటూ సరోజిని కొన్న లేహ్యం, తలనూనెలు పట్టుకు వంటింటిదగ్గర కొచ్చాడు చంద్రయ్య.

'ఇవ్వాళ బజార్లో కొన్నానండి. మంచి గుణం యిస్తాయని సుబ్బమ్మగారు చెప్పింది.'

'భేష్. పేర్లడాబుతో ప్రజలనేగాక, వెళ్లాన్ని కూడా వల్లో కొట్టించావన్నమాట! పిచ్చిసరోజినీ, దీనో సువర్ణం శుద్ధ కావ్యం. సరస్వతి అకు కలిసింది. సరస్వతే కలిసింది కాబట్టి ఆమె వొంటిమీద ఎలాగూ, సరోజినిలాగాక, చిన్న మొత్తుబంగారం ఉండక పోదనే ధీమాతో దీనికి "సువర్ణమిశ్రమం"అని పేరిచ్చాను.' అని నవ్వసాగాడు చంద్రయ్య.

సరోజినికి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. ఇందాకగుంపు మధ్య అంత చులకనయినా భార్యాపిల్లల పోషణకని అన్ని తంటాలు పడినవ్యక్తి తనభర్త! ఆమె జాలికళ్లు అటు తిరిగి పైటకొంగుని ఆశ్రయించాయి.

'ఇంతకీ నీకివి కొనడానికి డబ్బెలా వచ్చిందో? జీతం ఋణదాతల పాలబడింది గదా?' అని అడిగి జవాబుకోసం చంద్రయ్య చాలాసేపు వేచివుండవలసి వచ్చింది.

గుచ్చిగుచ్చి అడిగినమీదట ఎలాగైతేనేం చెప్పింది సరోజిని: 'సుందరమ్మగారికి సవరాలు చేసేవాళ్లు ఊడిపోయిన జుత్తుని కొనుక్కుంటారని—' భర్తకళ్లనుంచి తనవైపు దుముకుతున్న జాలి జలపాతం చూసి, ఆ వాక్యం పూర్తిచెయ్యడం అనవసరమని భావించింది. ★

---

# అంతస్తుల నాగరికత

(27-వ పేజీ తరువాయి)

గుండా ఆకాశంలోకి దీర్ఘంగా చూస్తున్నాడు.

"ఎక్కడికో చెప్పండి" కండక్టరు గట్టిగా అరిచాడు.

"రాణిగంజి ఇవతల స్టేజీకి...నాకు దాని పేరు తెలియదు" అన్నాడాయన తొణుకూ బెణుకూ లేకుండా, కండక్టరు సణుక్కుంటూ ముందుకు కదిలాడు.

ఇంకోకాయన పదిరూపాయల నోటిచ్చాడు. కండక్టరు దగ్గఱ చిల్లరలేదు. ఆయననూ, ఆయన తాలూకు సామానాన్ని దుమ్మెత్తిపోశాడు. కండక్టరు. అతడు ఇంకెవ్వరితోనూ దెబ్బలాడటానికి వీలుచిక్కక కుడిచేయి గుప్పిటమూసి నుదుటికి చేర్చి "కటకటా...హా కటా" అంటూ నాటకంలోకి మళ్లే ఏకువ ప్రారంభించాడు.

రెండుమూడు స్టేజీలు దాటాయి. రాణిగంజిలో బస్సుఆగింది. జనం కండక్టర్ని అనేకవిధాలుగా తిట్టి తిట్టి బస్సుదిగారు. ముసిలాయన వెనక్కు తిరిగితిరిగి తీక్షణంగా చూస్తూ వెళ్ళిపోయాడు. నేనూ బస్సు దిగాను. మళ్ళీ ఏదో మర్చిపోయినవాడిలా వెనక్కువెళ్ళి కండక్టర్ని నిమీపించి ఇలా అన్నాను:

"అబ్బాయీ! నిన్నొకప్రశ్న అడిగి సమాధానం తెలుసుకొంటేగాని నేను ఇంటికి ఖులాసాగా వెళ్ళలేను. నాకు రాత్రి నిద్రపట్టదు. నువ్వు కోపగించుకోకుండా సమాధానం చెబుతావా?"

కండక్టరు కింత వినయం చూపించి మాటాడినవాడు అతని గతచరిత్రలో దొరకలేదో ఏమో అతడు కోపాన్ని దిగమింగుకొని

"దానికేమిటి అడగండిబాబూ"అన్నాడు.

"నువ్వు కండక్టరు ఉద్యోగం ఎన్నిరోజులనుంచి చేస్తున్నావు?" అనడిగాను.

"మూడు నెలలనుంచి చేస్తున్నానండి"

"అంతకు పూర్వం ఏం చేసేవాడవు బాబూ?" అనడిగాను. అతడు కొంచెంసిగ్గుపడ్డాడు. కాని నేనుబుజ్జగించి అడగటంవల్ల సమాధానం చెప్పాడు.

"నాలుగు సంవత్సరాలు క్లీనరుగా పనిచేశానండి. మెల్లగాచదవటం, రాయటం నేర్చుకొన్నానండి. అందుకని నాకీఉద్యోగం ఇచ్చారండి!"

నేను బస్సుదిగి ఇంకా రెండడుగులైనా వెయ్యలేదు. మళ్ళీ ఏదో మర్చిపోయినట్టు వెనక్కువెళ్ళాను. అప్పటికే బస్సుకదిలింది. ఫుట్ పాత్ మీద నిలబడ్డ ఆ కండక్టరు నన్ను పరీక్షచేస్తూనే వున్నాడు. నా ఆత్రుత తెలుసుకొన్నాడు. కదులుతున్న బస్సులోనుంచి "అప్పుడు నాటకంలో వేషాలుకూడా వేసేవాణ్ని"అని అతడు అరచినట్లయింది. సంతృప్తితో వెనక్కు తిరిగాను. హోటల్ లో రేడియో మొరుగుతోంది. ప్రాచీన భారత నాగరికతనూ, ఆధునిక పాశ్చాత్య నాగరికతనూ పోల్చి చెబుతూ ఆయనెవరో గాలిని పాడుచేస్తున్నాడు! ★